Mana Telangana 01-17/07/17.




# నాలుగు నెలల్లో మెట్రో ఆధునికీకరణ పనులు

- ప్రజాలిక అధికారులను ఆదేశించిన ఎండి ఎన్‌విఎస్ రెడ్డి
- ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో సమీక్ష
- సమస్యల పరిష్కారానికి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు

మన తెలంగాణ/సిటీబ్యూరో: మియాపూర్ – ఎస్.ఆర్.నగర్ కారిడార్ – 3 పరిధిలో చేపట్టిన ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని హైదరాబాద్ మెట్రోరైల్ ఎండి ఎన్‌విఎస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదర్‌నగర్ మెట్రో ట్రైనింగ్ సెంటర్లో ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌విఎస్‌రెడ్డి మాట్లాడుతూ మిగిలిపోయిన పనులను ఇంజినీర్లు, నగర ప్రణాళికాధికారులు నాలుగు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కొత్తగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామని, సమస్యలను వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలని సూచించారు. మున్సిపాల్ శాఖ మంత్రి కెటిఆర్ మెట్రోరైల్ నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారని అన్నారు. మియాపూర్ – ఎస్.ఆర్.నగర్ పరిధిలో పనులకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై ఎన్‌విఎస్ రెడ్డి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంఆర్ ఇంజినీర్లు డివిఎస్ రాజు, ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, సి.వినోద్‌కుమార్, జనరల్ మేనేజర్ బి.ఎన్.రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పైన వేళాడుతున్న విద్యుత్ తీగలు కేబుళ్లను భూగర్భానికి మార్చాలి. దీనివల్ల విశాలమైన ఫుట్‌పాత్‌ను నిర్మించి, దానిపై అందమైన అనువైన సౌకర్యాలు, పార్కింగ్ స్థలం అందుబాటులోకి వస్తుంది.

మియాపూర్ నుంచి హైదర్‌నగర్ వరకు 1 కిలోమీటర్ పరిధిలో గ్రామీణ క్రీడల కోసం స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్కిటెక్ట్ శంకర్‌నారాయణకు సూచించారు. అందమైన టైల్స్‌తో నిర్మిస్తున్న ఫుట్‌పాత్‌లతో ప్రజలకు అనువుగా ఉంటుంది.

మెట్రోరైల్ స్టేషన్ల పరిసర ప్రాంతాల్లో మొక్కలు, చెట్లతో పచ్చని వాతావరణం కోసం తగిన పథకాన్ని ఉద్యాన వనధికారులు ఏర్పాటు చేయాలి.

మియాపూర్ మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతాలు అహ్లాదకరమైన వాతావరణంతో పాటు మౌలిక సదుపాయాలతో ప్రజలు తమ విశ్రాంతి సమయాన్ని గడపడానికి అనువుగా ఉంటాయి.

మియాపూర్ మెట్రోరైల్ డిపో గ్రానెట్ ప్రహరి, పరిసరాల ఆధునికరణ ప్రస్ఫుటించేలా విద్యుద్దీకరణ ఏర్పాటు.

ఎక్కువ వాహనాల పార్కింగ్ కోసం విశాలమైన బస్–బేలు ఆటో –బేలు, ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు.



సంప్రదాయ వాహనాల నుంచి విద్యుత్ వాహనాలకు మారడానికి హైదరాబాద్ ఇతర నగరాలకి మార్గదర్శకంగా నిలుస్తుంది. ఇందుకోసం మెట్రో స్టేషన్లలో సౌర విద్యుత్, ఎలక్ట్రికల్ చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలి.

వరద నీటి నియంత్రణ, పారుదల కోసం జెఎన్‌టియు, మూసాపేట్, బాలానగర్, మరి కొన్ని మెట్రో స్టేషన్ల ప్రాంతాల్లో వరదనీటి కాలువల నిర్మాణం చేపట్టాలి.

అక్రమంగా రోడ్డుపై నిర్మించిన వాటిని జిహెచ్‌ఎంసి సహకారంతో తొలగించేందుకు చర్యలు. ఫుట్‌పాత్‌ల పొడవు 200 మీటర్ల నుంచి 600 మీటర్లకు పొడిగించాలి.

ప్రయాణీకులు మెట్రోరైల్ దిగగానే నేరుగా ప్రధాన రహదారిపై రాకుండా బస్ –బే, ఆటో బే, పార్కింగ్ స్థలానికి క్షేమంగా తరలించడానికి ఫుట్‌పాత్‌ల అంచులపై రైలింగ్‌లు, మార్గదర్శక చిహ్నాల ఏర్పాటు.

అన్ని మెట్రో స్టేషన్లలో రైళ్ల రాకపోకల వివరాలు తెలిపేందుకు డిజిటల్ సైన్ బోర్డులు, స్టేషన్ పరిసరాల వివరాలను తెలిపే మ్యాప్‌ల ఏర్పాటు.

మెట్రో ప్రయాణికులను సైకిళ్లు, ఫీడర్ బస్సులు, విద్యుత్ వాహనాలు, షేరింగ్ ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్ల క్రమంలో అన్ని మెట్రో స్టేషన్లలో మెట్ల కింద బైసైకిల్ స్టేషన్‌లను అందుబాటులోకి తేవడం.

భరత్ నగర్ రైతు బజార్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కలను నాటాలని సూచించారు.

ఎస్.ఆర్.నగర్ స్టేషన్‌లో నిర్మించిన ఫుట్‌పాత్ కోసం రూపొందించిన డిజైన్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. మరిన్ని డిజైన్లను పరిశీలించాలని ఆర్కిటెక్ట్‌లను ఆదేశించారు.